# కాంగ్రెస్ అభ్యర్థి బోగస్ కంపెనీలతో ఆర్థికంగా లాభపడ్డాడు



మాట్లాడుతున్న రెబల్ అభ్యర్థి సంజీవ్ రెడ్డి కుమారుడు హిమాభిషేక్ రెడ్డి

ఎదులాపురం, నవంబర్ 26 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానంటూ ప్రచారంలో చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డి బోగస్ కంపెనీలతో ఆర్థికంగా లాభపడ్డాడని రెబల్ అభ్యర్థి సంజీవ్ రెడ్డి కుమారుడు హిమాభిషేక్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాతో పాటు ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాస్ రెడ్డి బోగస్ కంపెనీలు స్థాపించారని ఆరోపించారు. అమెరికాలో అవకతవకలకు పాల్పడి ఆర్థికంగా లబ్ధిపొందారని, అదేవిధంగా ఆదిలాబాద్‌లోనూ రెండు ఫేక్ కంపెనీలను ఏర్పాటు చేశారన్నారు. ఖాళీగా ఉన్న కిరాణా దుకాణం ఫొటోలను చూపించారు. అలాగే ఆర్‌ఎస్ మాల్‌లో 118 బ్లాక్‌లో మరో కంపెనీ ఉందని అదికూడ ఫేక్ అన్నారు. ఇలా ప్రభుత్వం కంపెనీల కోసం ఇచ్చిన డబ్బును దుబారఖర్చులు చేస్తున్నారని ఆరోపించారు. బోగస్ కంపెనీలు ప్రారంభించడమే కాకుండా ఆదిలాబాద్ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల వేళ ప్రజల సంక్షేమం, ఉపాధి కల్పనపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లుగా ఎందుకు కంపెనీలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించలేదని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధికి అనాడు మాజీమంత్రి దివంగత సీఆర్ఆర్ కృషి చేశారని గుర్తు చేశారు. బోగస్ కంపెనీల పేరిట మోసం చేసిన కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్ రెడ్డికి ఓటు వేయవద్దని ప్రజలను వేడుకున్నారు. సమావేశంలో కౌన్సిలర్ అబంకటి అశోక్, నాయకులు సంజయ్, గేడం మాధవ్, నాహిద్ ,సంజయ్‌దుదే పాల్గొన్నారు.

## మద్యం స్వాధీనం

ఎదులాపురం, నవంబర్ 26 : మావలకు చెందిన కొత్తూరి రాజేశ్వర్ అనే వ్యక్తి బెల్ట్‌షాపులో రూ.20వేల విలువ చేసే 93 రాయల్ స్టాగ్ లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వన్ టౌన్‌లో సమావేశంలో వివరాలను వెల్లడించారు. కలెక్టర్ చౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా కొత్తూరి రాజేశ్వర్‌కు చెందిన బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీసీఎస్ కానిస్టేబుళ్లు గంగారెడ్డి, రుక్మారెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం



హస్నాపూర్‌లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీటీసీ, నాయకులు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 26 : బీఆర్‌ఎస్ గెలుపును కోరుతూ ఆ పార్టీ నాయకులు మండలంలోని హీరాపూర్, హస్నాపూర్, ఉమ్రి, చెరువుగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడ, జెండాగూడ గ్రామాల్లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నమూనా బ్యాలెట్ చూపుతూ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉపెందర్, ఎంపీటీసీలు లచ్చు, శారద, ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణ,నాయకులు వసంత్, అజయ్, బాబురావ్, ప్రకాశ్, మారుతి, షేక్ రావుఫ్, సుభాష్, చాంద్‌పాషా, నాందేవ్, మధుకర్, చత్రుబాజ్, దయానంద్, లక్ష్మణ్ ముకుంద్‌రావు పాల్గొన్నారు.



ఉమ్రి గ్రామంలో ప్రచారం చేస్తున్న నాయకులు



ఎదులాపురం: బైక్ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రవికిరణ్‌యాదవ్



ఆదిలాబాద్‌రూరల్ : దుస్తులు కుడుతూ ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

# బూటకపు హామీలు నమ్మొద్దు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- దుర్గానగర్, న్యూహౌసింగ్ బోర్డు, బంగారి గూడ కాలనీల్లో ప్రచారం

ఎదులాపురం, నవంబర్ 26 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బూటకపు హామీలతో రాజకీయ పబ్బం గడుపుకునేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దుర్గానగర్, న్యూహౌసింగ్ బోర్డు, బంగారిగూడ కాలనీల్లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న ప్రచారం నిర్వహించారు. వార్డులకు వచ్చిన ఆయనకు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతిని తలపించేలా బోనాలు ఎత్తుకొని మహిళలతో కలిసి ప్రచారం చేశారు. జొగు రామన్నను గజమాలలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. రోడ్ షోలో భాగంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాల సరళిని వివరించిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 50 ఏండ్లు కాంగ్రెస్‌కు అధికారమిస్తే ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ప్రస్తుతం బూటకపు గ్యారంటీలతో ప్రజల ముందుకొచ్చి ఉద్ధరిస్తామంటున్నారని విమర్శించారు. తొమ్మిదిన్నరేండ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్ , కౌన్సిలర్ పవన్ నాయక్, నాయకులు విజ్జగిరి నారాయణ, మహాకాల్ ఆజయ్, విలాస్, ప్రవీణ్, గోపాల్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



ఎదులాపురం: న్యూహౌసింగ్‌బోర్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

## బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతుగా బైక్ ర్యాలీ

ఎదులాపురం, నవంబర్ 26 : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు యాదవ్ కులబాంధవుల సంపూర్ణ మద్దతు ఉందని ప్రముఖ సినీ నిర్మాత, సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్, డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనం నుంచి 100 మందితో కలిసి బైక్ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ కలెక్టర్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న జోగు రామన్నకు మద్దతు ఇవ్వాలన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం యాదవ్, యాదవులు, నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

### నిరాలలో..

జైనథ్, నవంబర్ 26 ః మండలంలోని నిరాల గ్రామంలో సర్పంచ్ సునంద– ప్రభాకర్ ఇంటింటికి తిరుగుతూ జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విశేష స్పందన

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 26 : ప్రజలకు అండగా నిలిచేలా అనేక పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాల తీరును వివరించారు. మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వివరించి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. అంతకుముందు రవీంద్రనగర్‌లో అయ్యప్ప స్వామి పల్లకీ సేవ కార్యక్రమంలో చైర్మన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎదులాపురం: ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు ఘన స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు



జైనథ్ : నిరాలలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

నార్నూర్, నవంబర్ 26 : ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్‌ఐ రవికిరణ్ అన్నారు. ఆదివారం తాడిహత్నూర్, నాగల్‌కొండ గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో గాదిగూడ ఎస్‌ఐ మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రాంతివీర్ లాహుజీ సాల్వేను ఆదర్శంగా తీసుకోవాలి

నార్నూర్, నవంబర్ 26 : క్రాంతివీర్ లాహుజీ సాల్వేను ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాతంగ్ సమాజ్ ఆధ్వర్యంలో లాహుజీ సాల్వే జయంతి నిర్వహించారు. లాహుజీసాల్వే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ సురేశ్, ఎంపీటీసీ పరమేశ్వర్, డైరెక్టర్ దుర్గేకాంతారావ్, నర్సింగ్‌మోరే, దుర్గే మహేందర్, రాథోడ్ సుభాష్, మహేందర్, రాము, రాజు పాల్గొన్నారు.

## కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

నార్నూర్, నవంబర్ 26 : ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని సర్పంచ్ పవార్ ఇందల్ కోరారు. ఆదివారం మండలంలోని మలేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



మలేపూర్‌లో ప్రచారం చేస్తున్న సర్పంచ్ పవార్ ఇందల్